క్లుప్తంగా

29న ఉచిత వైద్య శిబిరం

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ కాలనీ అపార్టుమెంట్ అసోసియేషన్ కార్యాలయంలో 29వ తేదీ ఆదివారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ నాయకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరం ప్రసాద్ ఆస్పత్రి వైద్యులతో నిర్వహించనున్నారు. ఈ శిబిరంలో గైనకాలజీ, జనరల్ వైద్య పరీక్షలు, ఆర్థో, ఈఎన్‌టీ, కార్డియాలజీ, పిడియాట్రీషియన్ వంటి సమస్యలకు మంచి అనుభవజ్ఞులైన వైద్యులు పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పరిసర ప్రాంతవాసులు అందరూ వినియోగించుకోవాలని కోరారు.

అమ్మవారికి ఎమ్మెల్యే గాంధీ పూజలు



భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని మిత్ర హిల్స్‌కాలనీలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జరిగిన పూజా కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావుతో కలిసి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉరిటి వెంకట్‌రావు, వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, సత్యనారాయణ, సుబ్బారావు, రాములు, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఇనార్బిట్‌లో కొత్త డిజైనర్ కలెక్షన్స్..

సాక్షి, సిటీబ్యూరో: మాదాపూర్‌లోని ఇనార్బిట్ మాల్ సరికొత్త డిజైనర్ కలెక్షన్స్‌ను నగరానికి తీసుకువచ్చింది. దేశవ్యాప్తంగా పేరొందిన ప్రముఖ డిజైనర్లు శంతను నిఖిల్‌కి చెందిన ఎస్ అండ్ ఎన్, నికోబార్, గాంట్, ట్రూ రెలిజియన్, మెలిస్సా తదితర బ్రాండ్స్‌ను అందుబాటులోకి తెచ్చామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. విభిన్న రకాల కొత్త కొత్త ఆకర్షణలతో వేడుకలు నవంబరు 12 వరకూ కొనసాగుతాయని వివరించారు.

రేపు నిధి ఆప్ కే నిఖత్

పటాన్‌చెరు టౌన్: భవిష్యనిధి సంస్థ ద్వారా ప్రతినెల సమస్యల పరిష్కారానికి ఫిర్యాదుల్లో భాగంగా నిధి ఆప్ కే నిఖత్ 2.0ను ఈ నెల 27న నిర్వహించనున్నట్లు ప్రాంతీయ కమిషనర్ విశాల్ అగర్వాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.మూడు కేంద్రాల్లో మూడు శిబిరాలను ఉదయం 9:30 నుండి 5:45 గంటల వరకు నిర్వహిస్తామన్నారు.సంగారెడ్డి జిల్లాలో బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్ విద్యాభారతి హైస్కూల్, పటాన్‌చెరు మండలం పాశమైలారం ఐటీడబ్ల్యూ ఇండియా లిమిటెడ్, రుద్రారం ఎంఎస్‌ఎన్ లాబరేటరీలో శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సమస్యలు ఉన్నవారు పైన పేర్కొన్న మూడు కేంద్రాల్లో తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

17 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు 17 మందికి జరిమాన విధించిందని ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపారు. సోమ, మంగళవారాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 17మందిని పట్టుబడగా వారిని బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 15 మందికి ఒక్కొక్కరికీ రూ.2 వేల జరిమాన, ఒకరికి రూ.3వేలు, మరోకరికి రూ.5 వేలు జరిమాన విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

దుర్గం చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య

మాదాపూర్: తండ్రితో గొడవపడి కుమారుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఎన్. తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. గాజులరామారంలో నివాసముంటున్న సంపత్‌రావు (45) క్యాబ్ డ్రైవర్. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈనెల 24వ తేదీ సంపత్‌రావుకు తండ్రికి క్యాబ్ విషయమై గొడవ జరిగింది. దీంతో మనస్థాపం చెంది 25వ తేదీన ఉదయం మాదాపూర్‌లోని దుర్గం చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సంపత్ క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్న కంపెనీలో గత కొన్ని నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తి ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హెచ్‌సీయూలో 'ఆంత్రోపాలజీ పోస్ట్ కాంగ్రెస్ సదస్సు'

రాయదుర్గం: ఇంటర్నేషనల్ యూనియన్ ఆఫ్ ఆంత్రోపాలజీ అండ్ ఎత్నోలాజికల్ సైన్సెస్ (ఐయూఏఈఎస్) వారి 19వ వరల్డ్ ఆంత్రోపాలజీ పోస్ట్ కాంగ్రెస్ సదస్సు రెండు రోజులపాటు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. హెచ్‌సీయూ ఆంత్రోపాలజీ విభాగం గురు, శుక్రవారాల్లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనుంది. ఈ సదస్సు 'ఆంత్రోపాలజీ అండ్ డిజిటల్ కల్చర్స్' అనే అంశంపై జరగనుంది. ఈ సదస్సులో 25 పానెళ్ళు, అలాగే 100కు పైగా కార్యకర్తలు, ప్లానర్లు, కన్సల్టెంటులు, విద్యావేత్తలు పాల్గొంటారు.

ఎన్నికల తనిఖీల్లో రూ.3.49 కోట్లు పట్టివేత

- అన్ని పత్రాలు ఉన్నందున రూ.2.11 కోట్లు ఇచ్చేశాం..
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: ఎన్నికల నేపథ్యంలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో పలుచోట్ల తనిఖీలు, చెక్ పోస్టుల వద్ద పోలీసులు రూ.3,49,92,241 స్వాధీనం చేసుకోగా, జిల్లా గ్రీవెన్స్ కమిటీ(ఫిర్యాదుల కమిటీ) వీటికి సంబంధించిన అన్ని రకాల ధ్రువపత్రాలను పరిశీలించిన తర్వాత రూ.2,11,80,761లను తిరిగి అందజేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి చెక్‌పోస్టుల వద్ద భారీకేడ్లను ఏర్పాటు చేసి తనిఖీలతో ప్రత్యేకంగా నిఘా పెడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ నెల 24(మంగళవారం) వరకు జిల్లావ్యాప్తంగా 104 కేసులకు సంబంధించి రూ.3,49,92,241లు ఉండగా అందులో 70 కేసులకు సంబంధించి సరైన ఆధారాలు, ధ్రువపత్రాలు సమర్పించిన నేపథ్యంలో జిల్లా గ్రీవెన్స్ కమిటీ పరిశీలన అనంతరం రూ.2,11,80,761లను తిరిగి అప్పగించినట్లు తెలిపారు. ఐదు కేసులకు సంబంధించి ఎఫ్ఐఆర్ నమోదు కాగా, అందుకు సంబంధించిన నగదు రూ.28.18 లక్షలు ఉన్నాయన్నారు. సెక్యూరిటీ ఇతర దరఖాస్తులకు సంబంధించి 34 పెండింగ్‌లో ఉండగా, దీనికి సంబంధించి రూ.1,09,93,480లకు ధ్రువీకరణ పత్రాలు అందజేయాల్సి ఉందని ఆయన తెలిపారు. ఈ విషయంలో కేసుల విచారణ జరుగుతోందని, వాటిని కూడా త్వరగా పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. సామాన్య ప్రజలు ఇబ్బందులకు గురి కావద్దనే ఉద్దేశంతో స్వాధీనం చేసుకున్న సొత్తు పరిశీలన కోసం జిల్లా ఫిర్యాదుల కమిటీ (గ్రీవెన్స్ కమిటీ)ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించి రూ.50 వేల కంటే ఎక్కువ నగదు తరలించవద్దని, ఈ విషయంలో అధికారులకు సహకరించాలని ఆయన పేర్కొన్నారు. జిల్లా గ్రీవెన్స్ కమిటీలో కన్వీనర్ జిల్లా సహకార అధికారి శ్రీనివాసమూర్తి(91001 15724), సభ్యులుగా డీటీవో నర్సింహారావు (77999 34204) జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి పద్మజారాణి (73309 99280) వ్యవహరిస్తున్నారని, ఏవైనా సమస్యలు ఉంటే కమిటీని సంప్రదించాలని పేర్కొన్నారు.

నేటి నుంచి బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారం

బాలానగర్: ఫతేనగర్ డివిజన్‌లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గెలుపే లక్ష్యంగా అసెంబ్లీ ఎన్నికల ప్రచారాన్ని గురువారం నుంచి ప్రారంభించనున్నట్లు ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ పేర్కొన్నారు. డివిజన్‌లోని ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి సిద్ధమవుతున్నామని తెలిపారు. ఈ ప్రచారంలో భాగంగా బీఆర్‌ఎస్ పార్టీకే పట్టం కట్టాలని ప్రజలకు విజ్ఞప్తి చేయనున్నామన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన పలు పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించనున్నామన్నారు. మూడోసారి బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే ప్రజలకు ఏమి చేయబోతున్నామో చెప్పనున్నామన్నారు. అదే విధంగా బాలానగర్ డివిజన్ నుంచి ఎన్నికల ప్రచారాన్ని ఉదయం 8గంటలకు ఫిరోజ్‌గూడలోని శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి ప్రారంభించనున్నట్లు బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ పేర్కొన్నారు. ఈ ప్రచారంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అసోసియేషన్ సభ్యులు, స్థానికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

మూసాపేటలో ఫ్లాగ్ మార్చ్..

మూసాపేట: మూసాపేటలో బుధవారం కూకట్‌పల్లి పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మార్చ్ నిర్వహించామని ఏసీపీ శివభాస్కర్ తెలిపారు. ప్రజలు ధైర్యంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి ఇన్‌స్పెక్టర్ సురేందర్‌గౌడ్, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.



మేడ్చల్ టికెట్ బీసీలకు కేటాయించాలి

ఎన్.రవీందర్‌గౌడ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: శాసనసభ ఎన్నికల్లో భాగంగా మేడ్చల్ నియోజకవర్గం నుంచి భారతీయ జనతా పార్టీ(బీజేపీ) టికెట్‌ను వెనుకబడిన సామాజిక వర్గాల(బీసీ)కి చెందిన తనకు కేటాయించాలని అధిష్టానాన్ని కోరినట్లు బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి నూనెముంతల రవీందర్‌గౌడ్ తెలిపారు. బుధవారం జిల్లా ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి, రాష్ట్ర నేతలు ఈటల రాజేందర్, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్‌ను కలిసి విజ్ఞప్తి చేశానన్నారు. మేడ్చల్ టికెట్ కోసం కూడా దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. 15 ఏళ్లుగా బీజేపీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నానని పేర్కొన్నారు. నల్లగొండ జిల్లా గుర్రంపోడు పోరాటంలో దాదాపు 40 రోజు లు జైలు జీవితాన్ని అనుభవించినట్లు ఆయన తెలిపారు. 20 ఏళ్లుగా మేడ్చల్ నియోజకవర్గం బీజేపీలోని ఒకే సామాజిక వర్గం ఆధీనంలో కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో తూముకుంట మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి జంగారెడ్డి, బీజేవైఎం ఎంసీపల్లి అధ్యక్షుడు వేణుగోపాల్ పాల్గొన్నారు.

జిలానీ అహ్మద్‌కు పీహెచ్‌డీ

రాయదుర్గం: మనూ పరిశోధక విద్యార్థికి బుధవారం పీహెచ్‌డీ ప్రకటించారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలోని కంప్యూటర్ సైన్స్ పరిశోధక విద్యార్థి జిలానీ అహ్మద్ ఆ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ముఖీమ్ అహ్మద్ పర్యవేక్షణలో 'మెషిన్ లెర్నింగ్ అండ్ సెమాంటిక్ వెబ్ టెక్నాలజీతో వార్తా కథనాల అగ్రిగేషన్' అనే అంశంపై థీసిస్ సమర్పించారు.

ఓయూ ప్రొఫెసర్‌కు లీడర్‌షిప్ అవార్డు



అవార్డును అందుకుంటున్న ప్రొ. ఉమామహేశ్వర్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ప్రొ.ఉమామహేశ్వర్ లీడర్‌షిప్ అవార్డు అందుకున్నారు. ఇటీవల చెన్నైలో జరిగిన సొసైటీ ఆఫ్ ఆటోమోటివ్ ఇంజినీర్స్ ఇండియా(ఎస్ఏఈ) వార్షిక అవార్డుల కార్యక్రమంలో ఆయనకు లీడర్‌షిప్ అవార్డును ప్రదానం చేసి సన్మానించారు. ఎస్ఏఈ ఇండియా హైదరాబాద్ డివిజన్‌కు ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న ప్రొ.ఉమా మహేశ్వర్ గతేడాది కూడా ఇదే అవార్డును అందుకోవడం విశేషం.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటుతున్నాం



శిల్పా ఎన్‌క్లేవ్ పార్కులో పునాస మామిడి మొక్కను నాటుతున్న విశ్రాంత ఉద్యోగులు

కూకట్‌పల్లి: విజయదశమి పండుగను పురస్కరించుకొని శిల్పా ఎన్‌క్లేవ్ పార్కులో బుధవారం విశ్రాంతి ఉద్యోగులు పునాస మామిడి మొక్కను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత సంవత్సరం కూడా విజయదశమికి పార్కులో, లక్ష్మీ గణపతి ఆలయంలోని పార్కులో పవిత్రమైన జమ్మి మొక్కలను నాటామన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రిసిటి ఎంప్లాయిస్ యూనియన్327 స్టేట్‌వైస్ ప్రెసిడెంట్ కె. వెంకటేశ్వర్లు, ఎస్. రమేష్, ఆర్. శ్రీనివాస్‌రెడ్డి, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

రోగులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులు

పంజగుట్ట: టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డి పుట్టినరోజు సందర్భంగా యువజన కాంగ్రెస్ నాయకుడు బుధవారం నిమ్స్ ఆస్పత్రిలో అన్నదానం, పండ్ల పంపిణీ చేశారు. యువజన కాంగ్రెస్ నాయకులు మందాడి ప్రవీణ్ యాదవ్, సి.రాజశేఖర్ ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నిత్యం ప్రజలతో ఉంటూ, ప్రజలే దైవంగా భావించే విజయారెడ్డి ఇలాంటి పుట్టినరోజులు ఎన్నో జరుపుకోవాలన్నారు. వచ్చే పుట్టినరోజు ఖైరతాబాద్ ఎమ్మెల్యే హోదాలో ఘనంగా చేస్తామని ధీమావ్యక్తం చేశారు.

ఖైరతాబాద్‌లో...

ఖైరతాబాద్: టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డి పుట్టిన రోజు సందర్భంగా బుధవారం ఖైరతాబాద్ డివిజన్‌లోని పార్టీ కార్యాలయం వద్ద స్థానిక నాయకులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ ఎస్.కె.షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

కులమతాలకు అతీతంగా పండుగలు జరుపుకోవాలి

మహమ్మద్ జాహెద్ షరీఫ్‌బాబా



నిమజ్జన కార్యక్రమంలో పర్వత్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మహమ్మద్ జాహెద్ షరీఫ్

మోతీనగర్: అన్ని పండుగలను కుల, మతాలకు అతీతంగా కలిసి జరుపుకోవటం ఎంతో ఆనందమైన విషయమని పర్వత్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, కూకట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహమ్మద్ జాహిద్ షరీఫ్ బాబా పేర్కొన్నారు. నవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా నిర్వహించిన అమ్మవారి నిమజ్జన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ దైవ చింతనతో ఈ కార్యక్రమం నిర్వహించటంతో విజయవంతంగా ముగిసిందన్నారు. ప్రతి వేడుకలను రాజకీయాలకు, కులమతాలకు అతీతంగా నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సుంకన్న, గౌరవ అధ్యక్షుడు రాజారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'హెబ్రోన్' పేరుతో అక్రమాలకు పాల్పడే వారిపై చర్యలు

చిక్కడపల్లి: క్రైస్తవులకు పవిత్రమైన 'హెబ్రోన్ సంస్థ' పేరుతో అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని 'ది సొసైటీ ఆఫ్ ఇండిజినెస్ ఇన్ ఇండియా' బ్రదర్ జోసెఫ్ కురియన్, సొసైటీ అధికార ప్రతినిధి, ప్రధానకార్యదర్శి ఆర్.వీరాచారి హెచ్చరించారు. బుధవారం గోల్కొండ క్రాస్‌రోడ్స్‌లోని హెబ్రోన్ చర్చిలో ఆయన మాట్లాడారు. దేశంలోని వేలాది క్రైస్తవ సంఘాలను నిర్వహిస్తున్న హెబ్రోన్ చర్చ్‌ను బ్రదర్ భక్తసింగ్ గోల్కొండ క్రాస్‌రోడ్స్‌లో ది సొసైటీ ఆఫ్ ఇండిజినెస్ చర్చెస్ ఇన్ ఇండియా పేరుతో ఒక మంచి ఆశయంతో 1971లో ఏర్పాటు చేస్తే కొందరు ఈ సంస్థను, చిరునామాను కూడా తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం అక్రమంగా వాడుకుంటున్నారని ఆరోపించారు. ఈ ట్రస్ట్ అనేది ఈ చిరునామాలో పనిచేయడం లేదని స్పష్టం చేసారు. కేఎం. శ్యాంసన్, బానోతు భీమా అలియాస్ బర్నబాస్, ట్రస్ట్ సభ్యులు కొందరు తమ ఆధార్ కార్డులతో సొసైటీ చిరునామాను అక్రమంగా వాడుకుంటున్నారన్నారు. అక్రమంగా గ్యాస్ కనెక్షన్‌లు తీసుకుని నేరేడుచర్ల, విద్యానగర్‌లోని బృందావన్ కాలనీలోని సీయోను ప్రార్థనా మందిరంలో ఉంటున్నారన్నారు. ఇదే అంశంపై ముషీరాబాద్ పోస్టు ఆఫీస్, గ్యాస్ ఏజెన్సీ, పోలీసులు, తహసీల్దార్ అధికారులకు వివరించామన్నారు. చర్చ్ సభ్యులు మరోసారి మోసపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

ట్రాఫిక్ సమస్య ఇప్పట్లో పరిష్కారమయ్యేట్లు లేదు!

నిజాంపేట్: ప్రగతినగర్ వాసులకు ఇప్పుడే ట్రాఫిక్ ఇక్కట్లు తొలగే పరిస్థితులు కనిపించడం లేదు. ప్రగతినగర్ ప్రధాన రోడ్డు మరమ్మతు పనుల నేపథ్యంలో రెండు వారాలుగా మోర్ సూపర్ మార్కెట్ నుంచి ఇన్‌కాయిస్ సర్కిల్ వరకు రోడ్డును అల్లూరి సీతారామరాజు విగ్రహం సమీపంలో బ్లాక్ చేశారు. నిత్యం వందలాది వాహనాలను రద్దీగా ఉండే ఈ మార్గాన్ని వన్‌వే చేయడంతో ఉదయం, సాయంత్రం వేళల్లోని ట్రాఫిక్ రద్దీ సమయాల్లో వాహనదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. ఇంకెన్ని రోజులు తమకు ఈ ట్రాఫిక్ ఇబ్బందులని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు యుద్ధప్రాతిపదికన రోడ్డు మరమ్మతులు పూర్తి చేసి కష్టాలు తీర్చాలని కోరుతున్నారు.

డేంజర్ మలుపు! ఆదమరిస్తే అంతే!



నిజాంపేట్ జర్నలిస్ట్ కాలనీ సమీపంలో ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు

నిజాంపేట్: ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు వాహనదారులకు పాలిట శాపంగా మారుతోంది.. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నిజాంపేట్ గ్రామం నుంచి డబుల్ బెడ్‌రూమ్ గృహ సముదాయం మీదుగా వెళ్తున్న 100 పట్ల రోడ్డు జర్నలిస్ట్ కాలనీ సమీపంలోని మూలమలుపు ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. మూలమలుపు వద్ద ఎదుటి వాహనాలు కనిపించకపోవడంతో ఎదురెదురుగా వేగంగా వచ్చే వాహనదారులు ఒక్కసారిగా ఢీకొట్టుకుంటున్నారు. దీంతో ఇరువురి మధ్య కొట్లాటలు జరిగిన ఘటనలు చాలా ఉన్నాయి.

ఒక పక్క మూలమలుపు, మరో పక్క చెరువు..

జర్నలిస్ట్ కాలనీ సమీపంలోని రోడ్డులో ఒక వైపు మూలమలుపు, మరో వైపు తుర్క చెరువు ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూలములవులో ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో మరో వైపున ఉన్న తుర్క చెరువులోకి వాహనాలు దూసుకెళ్తున్నాయి. దీంతో మూలమలుపు వద్ద రెండు వైపులా ప్రమాదాలు పొంచి ఉన్నాయి.

వీధి దీపాల లేక ఇక్కట్లు..

ఈ ప్రాంతంలో రోడ్డుకు ఇరువైపులా రాడ్లు ఏర్పాటు చేయడంతో రాత్రి వేళల్లో వాటిని గుర్తించక వాహనదారులు ఢీకొంటున్నారు. దీంతో రాత్రి వేళల్లో ఇటుగా రాకపోకలు సాగించాలంటే వాహనదారులు జంకాల్సిన పరిస్థితి నెలకొంటోంది. అయితే చుట్టు పక్కల నుంచి పలు బస్తీలు, కాలనీ ప్రజలకు జర్నలిస్ట్ కాలనీ నుంచి నిజాంపేట్‌కు ఇదే మార్గం కావడంతో తప్పనిసరి పరిస్థితుల్లో రాకపోకలు సాగిస్తుంటారు. మూలమలుపు వద్ద రోడ్డును వెడల్పు చేయడంతో పాటు శాశ్వత ప్రాతిపదికన చెరువును ఆనుకుని కాంక్రీట్ గోడను ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

కళలతో చిన్నారుల్లో సృజనాత్మకత



ఆర్ట్ ద్వారా ఎలా సృజనాత్మకతను పెంచుకోవచ్చో చూపుతున్న గీతా భాస్కర్

పంజగుట్ట: చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు కళలు ఎంతో దోహదం చేస్తాయని ప్రముఖ విజువల్ ఆర్ట్స్ ఉపాధ్యాయురాలు, సినీ నటి గీతా భాస్కర్ అన్నారు. పాఠశాలల్లో 40 నిమిషాలు డ్రాయింగ్ క్లాస్ ఉంటుందని కాని దాన్ని సక్రమంగా వినియోగించుకోవడంలేదని అభిప్రాయపడ్డారు. టెంపర్‌వెరీ బుక్స్ ఇచ్చి పాత బొమ్మలు చూపుతూ వాటినే తిరిగి వెయ్యమంటున్నారని, అలా కాకుండా పిల్లల్లో క్రియేటివిటీ పెంచేందుకు ప్రయత్నించాలన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ... డ్రాయింగ్‌తో అన్ని రకాల సబ్జెక్టులు బోధించవచ్చునని పిల్లలకు మరింత మెదడుకు ఎక్కే అవకాశం ఉంటుందన్నారు. ఇండియన్ ఫైన్ ఆర్ట్ అండ్ మిడియా ఎడ్యుకేషన్ సొసైటీ ద్వారా ప్రత్యేక కోర్సును ప్రారంభించినట్లు దీనితో విద్యార్థుల్లో అంతర్లీనంగా సృజనాత్మకత వెలికితీయడంలో ఎంతో దోహదపడుతుందన్నారు. ఇప్పటికే నగరంలో పలు పాఠశాలల్లో ఈ కోర్సు విజయవంతంగా సాగుతుందని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సద్వినియోగం చేసుకుంటే అద్భుతాలు సాధించవచ్చునని తెలిపారు.

'రిజర్వాయర్‌లో దొంగలు పడ్డారు'


చింతల్: కుత్బుల్లాపూర్ వాటర్‌వర్క్స్ పరిధిలోని షైసర్‌నగర్ రిజర్వాయర్ వద్ద దొంగలుపడ్డారు. పలు రిజర్వాయర్లకు రాత్రి వేళల్లో సెక్యూరిటీ లేకపోవడంతో రిజర్వాయర్‌కు ఉన్న అల్యూమినియం తలుపును ఎత్తుకెళ్లారు. ఇటీవల జీఎం శ్రీధర్‌రెడ్డి రిజర్వాయర్ విజిట్‌కు వెళ్లిన సమయంలో తలుపు లేకపోవడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇదే విషయమై జీఎం శ్రీధర్ రెడ్డిని 'సాక్షి'వివరణ కోరగా తలుపు విషయమై ఆరా తీస్తున్నామని రాత్రి సమయంలో సెక్యూరిటీ ఉన్నా తలుపు మాయం అవడంతో పాత వారిని విధుల్లో నుంచి తొలగించి కొత్తవారిని నియమించినట్లు తెలిపారు. అదేవిధంగా రాత్రి సమయంలో సెక్యూరిటీ సిబ్బందిని మరింతగా పెంచేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

భరతనాట్య ప్రదర్శన



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న ఆలిండియా శారీమేళా ముగింపు కార్యక్రమంలో భాగంగా బుధవారం శ్రీ నారాయణి నాట్యాలయ గురువు సంతోష్‌కుమార్ తమాంగ్ శిష్యబృందం భరతనాట్య ప్రదర్శనతో సందర్శకులను అలరించారు. ఇందులో పుష్పాంజలి, అలరిపు, గణేశ కౌతం, జతిస్వరం, శబ్దం, దశావతారం, శబ్దం, కీర్తనం, కృతి, తిల్లాన, మంగళం తదితర అంశాలను ప్రదర్శించి అలరించారు. కళాకారులు అంకిత, పద్మ, భవ్య, హర్షిత, పియూసి, శరణ్య, రుచిత, వృందా, ఐశ్వర్య, సహస్ర, సిరిచందన, మిశ్క, పార్వతీ, జనని, సోమ తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ బూత్‌లు 39



వివరాలు వెల్లడిస్తున్న కిషన్‌రావు, శంకర్

సనత్‌నగర్: నియోజకవర్గంలో 39 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను అధికారులు గుర్తించారు. ఆయా పోలింగ్ బూత్‌లు 12 భవనాల్లో (లొకేషన్స్) ఉన్నాయి. ఈ మేరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఆర్వో) కిషన్‌రావు, అసిస్టెంట్ ఆర్వో శంకర్ వివరాలను వెల్లడించారు. నియోజకవర్గంలో 100 భవనాల్లో మొత్తం 229 పోలింగ్ బూత్‌లు ఉండగా వాటిలో క్లిష్ట, అతి కిష్టమైనవిగా గుర్తించి 39 పోలింగ్ బూత్‌ల్లో ఎన్నికల నాటికి భద్రతను కట్టుదిట్టడం చేసేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. నోడల్ అధికారి పర్యవేక్షణలో అతి క్లిష్టమైన బూత్‌లు కలిగిన భవనాల వద్ద ఒక సబ్ ఇన్‌స్పెక్టర్, ఆరు కేంద్ర సాయుధ బలగాల సిబ్బందిని నియమించేందుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. క్లిష్టమైన పోలింగ్ బూత్‌ల వద్ద హెడ్ కానిస్టేబుల్, మరో కానిస్టేబుల్, ఇంకో హోంగార్డు ప్రత్యేకంగా విధులు నిర్వహించనున్నారు.

సమస్యాత్మక బూత్‌లు ఇవే..

మోండా మార్కెట్ ఇస్లామియా బాలుర హైస్కూల్ భవనం, పద్మారావునగర్ సర్దార్‌పటేల్ కాలేజ్, న్యూబోయిగూడ గొల్లకొమురయ్య కాలనీ కమ్యూనిటీ హాల్, న్యూబోయిగూడలోని సెయింట్ ఫిలోమియా హైస్కూల్, నల్లగుట్టలోని జియా–ఉల్–ఇస్లాం హై స్కూల్, ఓల్డ్ నల్లగుట్టలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్, మహంకాళి స్ట్రీట్‌లోని ఉజ్జయినీ మహంకాళి టెంపుల్ సమీపంలోని ఆదయ్య మెమోరియల్ హైస్కూల్, బీకేగూడ రవీంద్రనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్, బాపునగర్ కమ్యూనిటీ హాల్, బేగంపేట పాటిగడ్డ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల, బ్రాహ్మణవాడీ గీతాంజలి స్కూల్, సనత్‌నగర్ అశోక్‌కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనాల్లో ఉన్న పోలింగ్ స్టేషన్లను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. ఆయా పోలింగ్ స్టేషన్లు బేగంపేట (2 పోలింగ్ కేంద్రాలు), గాంధీనగర్ (2), మహంకాళి పీఎస్ (1), మార్కెట్ పీఎస్ (1), చిలకలగూడ (1), రాంగోపాల్‌పేట్ (2), సనత్‌నగర్ (1), ఎస్ఆర్‌నగర్ (2) పోలీస్‌స్టేషన్లలో విస్తరించి ఉన్నాయి.

డీఆర్‌సీ కేంద్రంగా ఓయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల

సనత్‌నగర్ నియోజకవర్గానికి సంబంధించి డీఆర్‌సీ (డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్)గా ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలను ఎంపిక చేశారు. ఇక్కడ ఎన్నికల సామగ్రిని భద్రపరిచి పోలింగ్‌కు ఒక రోజు ముందు ఇక్కడి నుంచే నియోజకవర్గంలోని 229 పోలింగ్ స్టేషన్ల సిబ్బందికి పంపిణీ చేయనున్నారు. అందుకోసం నియోజకవర్గ పరిధిని 23 రెవెన్యూ రూట్లుగా విభజించారు. ప్రతి రెవెన్యూ రూట్‌లో ఒక సెక్టార్ అధికారి పర్యవేక్షణలో పోలీసు భద్రత ఉంటుంది. అదేవిధంగా నియోజకవర్గంలో చేరే ప్రాంతాల్లో మూడు ప్రత్యేక చెక్ పోస్టులను ఏర్పాటు చేయనున్నారు.